క్లుప్తంగా

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో 7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు విద్యార్థులు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఈనెల 11న ఉదయం 9 గంటలకు పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

బొండపల్లిలో జూనియర్ కళాశాల ప్రారంభం


మాట్లాడుతున్న ఎంఈఓ శోభారాణి

బొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వం జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసింది. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులను ఎంఈఓ శోభారాణి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం జూనియర్ కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. స్థానిక కళాశాలలో ఇంత వరకు ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 18 మంది, సీఈసీ గ్రూపులో ఆరుగురు చేరారని తెలిపారు. మండలంలోని విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక కళాశాలలో చేర్పించాలని కోరారు.ఎంఈఓ-2 అల్లు వెంకటరమణ,హెచ్‌ఎం ఉమామేశ్వరరావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో వరి విత్తనాలు

మెరకముడిదాం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరివిత్తనాలు అందుబా టులో ఉన్నాయని ఏఓ శ్రావణితేజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ- 1121, బీపీటీ- 3291(సోనామసూరి), సాంబమసూరి, తదితర రకాల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరా భూమికి 20 కిలోలు చొప్పున అయిదు ఎకరాలలోపు ఉన్న రైతులకు రాయితీపై విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, ఒన్‌బీతో, కౌలు రైతులు అయితే కౌలు కార్డు, ఆధార్ కార్డుతో ఆర్బీకేలో వీఏఏను సంప్రదించాలని సూచించారు. అలాగే ఆర్బీకేల్లో వేరుశనగ విత్తనాలు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో నేరుగా దరఖాస్తు అందజేయాలని సూచించారు.

మండల కేంద్రానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు

దత్తిరాజేరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు కొద్ది రోజుల క్రితమే మండల కేంద్రానికి చేరుకున్నాయని ఎంఈఓ ఎం.వెంకటరావు సోమవారం తెలిపారు. 4వ తరగతి మినహా 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం 24వేల పాఠ్యపుస్తకాలు సరఫరా చేసిందని, వాటిని దత్తిరాజేరు ఉన్నత పాఠశాలలో భద్రపరిచామని చెప్పారు. వీటిని కొద్ది రోజుల క్రితం డీఈఓ ప్రేమ్‌కుమార్ పరిశీలించారని తెలిపారు. 4వ తరగతి పాఠ్య పుస్తకాలు కూడా రెండు మూడు రోజుల్లో రానున్నాయని, పాఠశాలలు తెరిచే నాటికి అన్ని స్కూళ్లకు పుస్తకాలు సరఫరా చేస్తామని చెప్పారు.

పింఛన్ కోసం అవస్థలు


పింఛన్ డబ్బులు కోసం సీఎస్‌పీ పాయింట్ వద్ద వేచి ఉన్న వృద్ధులు

వేపాడ: మండలంలోని వృద్ధులు పింఛన్ డబ్బుల తీసుకునేందుకు అవస్థలు పడుతున్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభు త్వం గత నెలతో పాటు ఈనెల కూడా పింఛన్ డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే జమచేసింది. వాటిని తీసుకునేందుకు వృద్ధులు అష్టకష్టాలు పడుతున్నారు. గతంలో వలంటీర్లు ఒకటో తేదీన ఉదయాన్నే ఇంటి వద్దకు పింఛన్ అందజేసేవారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుట్రతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, ఇంటి వద్దకు పింఛన్లు అందకుండా చేశారు. బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాల్లో జమైన నగదును డ్రా చేసుకునేందుకు గ్రామాల నుంచి వచ్చే వృద్ధులు మండల కేంద్రంలోనొ బ్యాంకులు, సీఎస్‌పీ పాయింట్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

‘కోట’లో రాజకీయ రచ్చ...

- రఘురాజుపై అనర్హత వేటు...
- ఎవరిది కోటలో సీటు..
- ఎస్.కోటలో పెరిగిన హీటు..


ఎస్.కోట పట్టణం

శృంగవరపుకోట: ఎస్.‘కోట’లో హీట్ పెరిగింది. సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుంది. ఎవరు ఎంత మెజార్టీ సాధిస్తారు, ఎమ్మెల్యే, ఎంపీలుగా ఎవరు గెలుస్తారు. ఏ ఊరిలో ఏ పార్టీకి ఎక్కువ ఓట్లు వస్తాయి తెలిపోయే రోజు రావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏ ఇద్దరు కలిసినా ఇవే విషయాలు చర్చకు వస్తున్నాయి.

రఘురాజు వేటుపై రాజకీయ చర్చ

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఇందుకూరి రఘురాజు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొని పార్టీకి నష్టం చేస్తున్నారని, ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ శాసన మండలికి ఫిర్యాదు చేశారు. దీనిపై మండలి చైర్మన్ ఇప్పటికే రెండు ధపాలు రఘు రాజును విచారణకు హాజరు కావాలని ఆదేశించినా, ఆయన హాజరు కాకపోవడంతో సోమవారం అనర్హత వేటు వేస్తూ ఆదేశాలు ఇచ్చారు.ఈ అంశం సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. ఎన్నికల ఫలితాల వర కూ విచారణ వాయిదా వేస్తే, తెలుగుదేశం అధికారంలోకి వస్తే తనపై ఎటువంటి చర్యలు ఉండవని రఘురాజు వర్గం భావించింది. ఎన్నికల ఫలితాలకు ముందే వేటు పడడంతో రఘురాజు, టీడీపీ వర్గాలు ఖంగుతిన్నాయి.

కోటి మార్క్ దాటిన బెట్టింగ్‌లు

నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు, ఓటములపై కోటి రూపాయలు దాటి బెట్టింగ్ జరిగిం దనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు, స్థానికంగా ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుపై పందాలు జోరుగా సాగాయి. మరో పక్క సిల్లీగా మందు, బిర్యానీ కోసం కూడా బెట్టింగ్‌లు కాస్తున్నారు. విశాఖపట్నం ఎంపీ స్థానం ఏ పార్టీ దక్కించుకుంటుందో రాష్ట్రంలో అదే పార్టీ అధికారం దక్కించుకుంటుదనే సెంటిమెంట్‌తో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది. దీంతో విశాఖను దక్కించుకునేందుకు ఎస్.కోట అత్యంత కీలకం. గ్రామీణ నేపథ్యం ఉన్న ఈనియోజకవర్గం ఎవరికి మద్దతు ఇస్తే వారు ఉక్కు నగరంలో చక్రం తిప్పటం తథ్యం. నియోజకవర్గంలో 2,22,475 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,08,227 మంది పురుషులు, 1,14, 246 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 92,379 మగవారు, 97,724 మహిళలు మొత్తంగా 85,45శాతం మంది ఓటు వేశారు. నియోజకవర్గంలో 21,836 పోస్టల్ బ్యాలట్లు ఇవ్వగా, 19,738 మంది తమ ఓటు వినియోగించుకున్నారు. దీంతో ఎన్నికల ఫలితాల కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఉత్కంఠకు నేటితో తెర

- నేడే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- మధ్యాహ్నం 1 గంటకు తేలిపోనున్న ఫలితాలు

చీపురుపల్లి: సరిగ్గా ఇరవై రోజులుగా ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్న టెన్షన్‌కు మంగళవారం నాడు తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఎప్పుడు జరుగుతుందా అంటూ పోటీ చేసిన అభ్యర్థి నుంచి సాధారణ పౌరుడు వరకు ఊపిరి బిగపట్టుకుని ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. చీపురుపల్లి నియోకజవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు విజయనగరం- విశాఖపట్నం ప్రధాన రహదారిలో ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటిగ్ జరగనుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన అనంతరం ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు జిల్లా కేంద్రానికి చేరిపోయారు. చీపురుపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ విజయం దాదాపు ఖరారవ్వడంతో ఆ పార్టీ క్యాడర్ హుషారుగానే ఉంది. అంతేకాకుండా ఓట్లులెక్కింపు సమీపించిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో మరింత జోష్ కనిపిస్తోంది. గత ఇరవై సంవత్సరాలుగా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బొత్స సత్యనారాయణతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నియోజకవర్గంలోని ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తూ, మరోవైపు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేశాయని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా చీపురుపల్లి అసెంబ్లీపై బెట్టింగ్‌కు తొలి నుంచి ముందుకు రాని టీడీపీ కొద్ది రోజుల క్రితమే మీదైతే లక్ష రూపాయలు, మాదైతే అరవై వేల రూపాయలు అంటూ బెట్టింగ్‌లకు ముందుకొచ్చారు. అదే కౌంటింగ్ ముందురోజు సోమవారం టీడీపీ మరింత బెంగతో మాదైతే యాభై వేలే మీదైతే లక్ష రూపాయలు అంటూ బెట్టింగ్‌లు కాస్తామంటూ మాట్లాడడం కనిపించింది.

నియోజకవర్గంలో మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు....

మండలం	మొత్తం ఓటు	పోలైన ఓటు	పురుషులు	స్త్రీలు
చీపురుపల్లి	49,178	40,676	20,285	20,391
గరివిడి	56,120	45,863	23,039	22,823
మెరకముడిదాం	46,869	38,744	19,380	19,364
గుర్ల	53,317	46,250	23,107	23,142
మొత్తం	2,05,484	1,71,533	85,811	85,720

రహదారి కష్టాలు తీరాయ్....


పి.ఎస్.లక్ష్మీపురం గ్రామానికి నిర్మించిన తారు రోడ్డు

చీపురుపల్లి: ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న పి.ఎస్.లక్ష్మీపురం గ్రామస్తులు ఎదుర్కొంటున్న రహదారి కష్టాలు తీరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటకర్లపల్లి పంచాయతీ మధుర గ్రామమైన పి.ఎస్.లక్ష్మీపురం ఆ పంచాయతీ కేంద్రానికి దాదాపు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మండల కేంద్రం చీపురుపల్లి నుంచి ఇటకర్లపల్లి పంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారి నుంచి అర కిలోమీటర్ దూరంలో ఆ గ్రామం ఉంటుంది. అయితే ఆ గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కోసం గ్రామప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆగ్రామ ప్రజలు తారురోడ్డు సదుపాయం కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పి.ఎస్.లక్ష్మీపురం గ్రామానికి రూ.25.50 లక్షలతో తారు రోడ్డు మంజూరు చేసింది. వివిధ సమస్యల కారణంగా అప్పట్లో రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాలేదు. తాజాగా ఐదారు నెలల క్రితమే తారురోడ్డు నిర్మించారు. దీంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరిందంటూ అక్కడి నివాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ


క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న హెచ్ఎం ఉమామహేశ్వరరావు, కోచ్ శ్రీరాములు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో ఏర్పాటు చేసిన అంతర్గత పోటీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బంగారు ఉమామహేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. అతిథులుగా హాజరైన తానవరపు గోవింద, సురేష్ క్రీడాకారులకు రూ.35వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. నెల రోజులుగా సుమారు 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీరాములును హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు అభినందించారు. స్థానికులు ఉప్పల రాజేష్, కాపుగంటి శ్రీరామ్మూర్తి ఆర్.రాజా, ఆర్.సురేంద్ర, కె.పవన్, పి.వెంకటరావు, కె.సతీష్, దోకుల నాయుడు, క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్ పి.మౌనిక పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించేందుకు వేసవి శిబిరాలు దోహదం


గుర్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్


వేపాడ: కాగితాలతో తయారుచేసిన ఆర్టికల్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు

గుర్ల: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయని గుర్ల హైస్కూల్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. గుర్ల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యా ర్థులకు పలు అంశాలపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్, విద్యార్థులకు ప్లాంక్లు, డ్రాయింగ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే..

వేపాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులతో సోమవారం పేపర్ క్రాఫ్ట్‌లో భాగం వివిధ రకాల బొమ్మలను తయారు చేయించారు. వ్యాసరచన, ఆటలు, తదితర పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు శిబిరం ముగింపు రోజును బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

నేడు 144 సెక్షన్ అమలు

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గజపతినగరం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోనూ మంగళవారం144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ యు.మహేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు విజయనగరంలో జరుగుతుందని చెప్పారు. ఫలితాలు వెలువడిన తర్వాత ఏ పార్టీ వారైనా సరే విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు నిర్వహించరాదని, బాణసంచా కాల్చడం వంటి వాటిపై నిషేధం ఉంద న్నారు.ఎవరైనా గొడవలు సృష్టించినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు.

గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు

దత్తిరాజేరు: ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయని, రాజకీయ పార్టీల అభిమానులు సంయమనం పాటించాలని ఎస్ భూర్జవలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ కోరారు. పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడు తూ విజయోత్సవ ర్యాలీలపై నిషేధం ఉందన్నారు. గొడవలు సృష్టించినా, హింసాత్మక ఘటనలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించామని, సమస్యాత్మక గ్రామాలపై పోలీస్ నిఘా ఉంటుందని పేర్కొన్నారు. గొడవలకు దిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పాముకాటుతో కానిస్టేబుల్‌కు అస్వస్థత

బొండపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.రమణ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యారు. కానిస్టేబుల్ రమ ణ సోమవారం ఉదయం స్టేషన్ వెనుక ఆవరణలోకి వెళ్లగా అక్కడ పాముకాటు వేసింది. వెంటనే గమనించిన తోటి సిబ్బంది గజపతినగరం లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అనంతరం రమణ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉండడంతో ఇంటికి తరలించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

రాజాం: స్థానిక పట్టణంలోని బాలభవన్ వద్ద ఏప్రిల్‌లో ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. 40 రోజుల పాటు కొనసాగిన ఈ తరగతుల్లో శాస్త్రీయ నృత్యం(భరతనాట్యం, కూచిపూడి), చిత్రలేఖనం, తబలా వంటి వాటిల్లో శిక్షణ ఇచ్చామని ప్రొగ్రాం డైరెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా అందజేశామన్నారు.

సలహాలు పాటిద్దాం.. కల్తీని నివారిద్దాం!


ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతు

- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తం
- అనుమతులున్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి
- కొనుగోళ్లకు సంబంధించి, వ్యాపారుల నుంచి రసీదు పొందాలి
- మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు ఇస్తామంటే నమ్మొద్దు

వంగర: రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు ఇప్పుడిప్పుడే కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు విత్తుకోవడానికి దుక్కులు చేసి, పొలాలను సిద్ధం చేస్తున్నారు. విత్తన ఎంపిక, పంటల సాగుపై వ్యవసాయాధికారులు రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. కల్తీ(నాణ్యత లేని) విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి ఉంది. అటువంటి పరిస్థితిని రైతులు అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతు భరోసా కేంద్రాలు, లైసెన్స్ పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగుకు సన్నద్ధమవుతున్న రైతులంతా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే విత్తనాలు, ఎరువుల్లో కల్తీని నివారించి, అధిక దిగుబడులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

‘కియోస్క్’తో మోసానికి అడ్డుకట్ట..

రైతులు మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో కియోస్క్ సాంకేతిక పరికరాన్ని ఏర్పాటు చేశారు. దీనిద్వారా రైతులకు కావాలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని, సకాలంలో పొందవచ్చు.

అందుబాటులో విత్తనాలు..

రైతు భరోసా కేంద్రాల్లో 969 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఎంటీయూ-1064, ఎంటీయూ-1121, ఎంటీయూ-1318, ఎంటీయూ-7029, ఎంటీయూ-1224 రకం విత్తనాలు, యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు ఉన్నాయి. అలాగే మరో 59 క్వింటాళ్ల జీలుగు, కట్టెజనుము విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యత కలిగిన విత్తనాలు, యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయి.
- వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసినప్పుడు వ్యాపారి నుంచి రసీదు తప్పనిసరిగా పొందాలి.
- కంపెనీ పేరు లేని విత్తనాలు, లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- గడువు దాటిన విత్తనాలు, పురుగుమందులు, చినిగిన ప్యాకెట్లు, మార్కెట్ ధర కన్నా తక్కువకు ఇస్తామని చెప్పే వారి వద్ద కొనవద్దు.
- రైతులకు అందజేసే బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే అమ్మకపు నంబరు, రైతుపేరు, విక్రయదారుడి సంతకం, గడువు తేదీ, బ్యాచ్ నంబరు, నికర తూకం వంటి అంశాలు నమోదు చేయాలి.
- విత్తనాలు మొలకెత్తే దశలో లోపాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత ముందుగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చే బిల్లును పంట పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినా బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.

ఆర్‌బీకేల్లో నాణ్యమైన విత్తనాలు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులన్నీ అనుకూల ధరలకే లభ్యమవుతున్నాయి. రైతులు ఎవరూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోళు చేసి, మోసపోవద్దు. ప్రభుత్వ అనుమతి ఉంటే తప్ప డీలర్ల వద్ద కొనుగోలు చేయవద్దు. రైతులను మోసగించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– తట్టికోట కన్నబాబు,
ఏవో, వంగర.

ఈదురు గాలులతో వర్షం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు , చెట్లు


గుర్ల: అచ్యుతాపురం వద్ద రోడ్డుపై విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు, పోలీసులు, స్థానికులు


గజపతినగరం: పురిటిపెంటలో రోడ్డుపై కూలిన తాటి చెట్టు


గజపతినగరం: పురిటిపెంట గ్రామంలోని రైల్వేకాలనీలో విరిగిన విద్యుత్ స్తంభం

గజపతినగరం: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఈదురుగాలులు,ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పురిటి పెంట రైల్వే కాలనీలో నాలుగు విద్యుత్ స్తంభాలు, ఒక తాటిచెట్టు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ జి.శంకరరావు పర్యవేక్షణలో సోమవారం సాయంత్రానికి సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

రోడ్లపై కూలిన చెట్లు

గుర్ల: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గుజ్జింగివలస, అచ్యుతాపురం, చుక్కపేట, పెనుబర్తి గ్రామాల్లో రోడ్డుకు ఆనుకొని ఉన్న చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ చెట్లను ఎస్‌ఐ భాస్కరరావు, పోలీస్ సిబ్బంది, స్థానికులతో కలిపి సోమవారం ఉదయం తొలగించారు.